నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | ఆదివారం 30 జూన్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

విద్యార్థినికి పాముకాటు

సిర్పూర్(టీ), జూన్ 29 : మండలంలోని అచ్చల్లి ప్రాథమిక పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న రాలి దర్శితను శనివారం పాము కాటు వేసింది. అచ్చల్లికి చెందిన దర్శిత శనివారం ఉదయం 8 గంటలకు పాఠశాలకు చేరుకున్నది. స్నేహితులతో కలసి ఆడుకుంటున్న క్రమంలో అక్కడున్న నీటి సంపుపై ఉన్న మూతను తొలగించింది. దీంతో దానికింద ఉన్న కట్ల పాము ఒక్కసారిగా కాటు వేసింది. దర్శిత కేకలు వేయడంతో స్నేహితులు కుటుంబసభ్యులకు సమాచారమందించారు. సిర్పూర్(టీ) లోని సామాజిక దవాఖానకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కాగా, సరైన చికిత్స అందుతుందన్న ఉద్దేశంతో పామును చంపి బాటిల్‌లో బంధించి వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. ప్రస్తుతం దర్శిత ఆరోగ్యం నిలకడగా ఉందని ఉపాధ్యాయులు తెలిపారు.

చికిత్స పొందుతున్న విద్యార్థిని దర్శిత

కవ్వాల్‌లో ఐటీడీఏ పీవో పర్యటన

జన్నారం, జూన్ 29 : కవ్వాల్ టైగర్ రిజర్వుడ్ ఫారెస్ట్‌లో ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా తన కుటుంబ సభ్యులతో కలిసి శనివారం పర్యటించారు. జన్నారం, తాళ్లపేట రేంజ్‌లో పరిధిలోని గోండుగూడ వాచ్‌టవర్, బైసన్‌కుంట, మల్యాల్ వాచ్‌టవర్‌లను సఫారీలో తిరుగుతూ పరిశీలించారు. అడవుల్లో వన్యప్రాణులు, విదేవీ పక్షులను ప్రత్యక్షంగా వీక్షించారు. కవ్వాల్‌లో సఫారీ చేయడం కొత్త అనుభూతినిచ్చిందని తెలిపారు. రేంజ్ ఆఫీసర్ సుష్మారావు ఉన్నారు.

కవ్వాల్ అడవుల్లో సఫారీలో పర్యటిస్తున్న ఐటీడీఏ పీవో

టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సురేందర్‌రెడ్డిని నియమించి అభినందిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు రాజిరెడ్డి

శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్

రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బండి రమేశ్

రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పానుగంటి సత్తయ్య

రాష్ట్ర చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పొగాకు రమేశ్

ఆర్గనైజింగ్ కార్యదర్శి పెండ్రి అన్వేష్‌రెడ్డి

81 మందితో టీబీజీకేఎస్ రాష్ట్ర కార్యవర్గం

● శ్రీరాంపూర్ నుంచి 9 మందికి స్థానం ● రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సురేందర్‌రెడ్డి ఎన్నిక
● శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడిగా పెట్టం లక్ష్మణ్

శ్రీరాంపూర్, జూన్ 29 : గోదావరిఖనిలోని టీబీజీకేఎస్ ప్రధాన కార్యాలయంలో శనివారం నిర్వహించిన తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర స్థాయి సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ మేరకు టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి 81 మందితో పూర్తి స్థాయి కార్యవర్గాన్ని ప్రకటించారు. ఇందులో శ్రీరాంపూర్ ఏరియా నుంచి 9 మందికి స్థానం లభించించింది. టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, డిప్యూటీ ప్రధాన కార్యదర్శిగా బండి రమేశ్, సంయుక్త కార్యదర్శిగా పానుగంటి సత్తయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడిగా పెట్టం లక్ష్మణ్, రాష్ట్ర చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పొగాకు రమేశ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పెండ్రి అన్వేష్‌రెడ్డితో పాటు కార్యవర్గ సభ్యులుగా ఎండీ లాలా, గోనె స్వామి, గోప్యా, ముత్యాల రమేశ్‌ను నియమించారు.

సురేందర్‌రెడ్డికి సముచిత స్థానం

శ్రీరాంపూర్‌కు చెందిన కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ప్రజాప్రతినిధిగా సుదీర్ఘ అనుభవమున్న సురేందర్‌రెడ్డికి యూనియన్‌లో సముచిత స్థానం దక్కింది. డిసెంబర్ 18, 1982 లో సింగరేణి ఉద్యోగంలో చేరిన సురేందర్‌రెడ్డి, 1991లో సింగరేణి క్లరికల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. 1995లో ఎంపీటీసీ(స్వతంత్ర అభ్యర్థి)గా పోటీ చేసి గెలుపొందారు. 1998లో టీడీపీ మంచిర్యాల మండల అధ్యక్షుడిగా కొనసాగారు. 1999లో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధిగా, 2000లో టీడీపీ రాష్ట్ర డివిజన్ రిసోర్స్ పర్సన్‌గా కొనసాగారు. 2010-15వరకు టీబీజీకేఎస్ కేంద్ర ఉపాధ్యక్షుడిగా సేవలందించారు. 2015-23 వరకు టీబీజీకేఎస్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడిగా కార్మిక వర్గానికి సేవలందించారు. కబడ్డీ క్రీడాకారుడిగా, జిల్లా కబడ్డీ అసోసియేషన ప్రధాన కార్యదర్శిగా కొనసాగారు. కార్మిక వర్గానికి, ప్రజలకు అందించిన సేవలకు గుర్తింపుగా రాష్ట్ర నాయకత్వం టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించింది.

గనులు సింగరేణికే అప్పగించాలి

● బొగ్గు బ్లాకుల వేలం, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలి ● కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీలో తీర్మానం చేయాలి
● జూలైలో నిర్వహించే ఆందోళనలను విజయవంతం చేయాలి ● విలేకరుల సమావేశంలో టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి

శ్రీరాంపూర్, జూన్ 29 : కేంద్ర ప్రభుత్వం గుజరాత్‌లో కేటాయించిన విధంగానే నామినేషన్ పద్ధతిలో గనులను సింగరేణికే అప్పగించాలని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. శనివారం శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ కొంగు బంగారంగా ఉన్న సింగరేణి గనుల వేలం, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికవర్గం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నిన్న మొన్నటి దాకా గనుల వేలంలో సింగరేణి పాల్గొనాలని చెప్పిన ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ సంఘాలు ఇప్పుడు యూ-టర్న్ తీసుకున్నాయని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు ద్వంద వైఖరి అవలంభిస్తున్నాయని మండిపడ్డారు. అప్పటి బీఆర్ఎస్ ఎంపీలు కవిత, బాల్క సుమన్ పార్లమెంటులో గనుల ప్రైవేటీకరణను వ్యతిరేకించారని గుర్తు చేశారు. ఆ చట్టాన్ని సెలక్ట్ కమిటీకి సిఫార్సు చేశారని, ఆ చట్టం ఆమోద సమయంలో తమ పార్టీ లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గనుల వేలం, ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే గనుల వేలం, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికులు సంస్థలో పాలేరులుగా లేరని, వాటాదారులుగా ఉన్నారన్నారు. బీజేపీ ప్రభుత్వం సింగరేణి వనరులను దోచుకోవాలని, కార్మికులను పాలేరులుగా చేయాలని చూస్తుందని ఆరోపించారు. జూలై 1 నుంచి 9వ తేదీ వరకు కార్మికులతో కలిసి ఆందోళనలు చేపడుతామని పేర్కొన్నారు. జూలై 9న గోదావరిఖనిలో నిర్వహించే ధర్నాకు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు హాజరవుతారన్నారు. కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో టీబీజీకేఎస్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బండి రమేశ్, సంయుక్త కార్యదర్శి పానుగంటి సత్తయ్య, చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పొగాకు రమేశ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పెండ్రి అన్వేష్‌రెడ్డి, నాయకులు గోపాల్, లాలా, గురుమూర్తి, రవి గౌడ్, రాజేశం, చాట్ల రమేశ్, గొర్ల సంతోష్, బిరుదు శ్రీనివాస్, జలపతి, తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి

బొగ్గు గనుల వేలం ఆపాలి

సీపీఐ(ఎం) డిమాండ్.. నిరసన

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూన్ 29 : బొగ్గు గనుల వేలం పాటను నిలిపివేసి, సింగరేణికే కేటాయించాలని సీపీఐ(ఎం) పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు దుర్గం దినాకర్, కోట శ్రీనివాస్ నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ బొగ్గు గనులు వేలం వేయబోమని చెప్పి, ప్రస్తుతం ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పడమేమిటని ప్రశ్నించారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం స్పందించి వేలం ఆపాలని, లేదంటే పెద్ద ఎత్తున నిరసనలు, ర్యాలీలు రాస్తారోకోలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎం) పార్టీ జిల్లా నాయకులు గొడిసెల కార్తీక్, జాదవ్ రాజేందర్, గేడం టీకానంద్, మాలశ్రీ, జాడి తిరుపతి, నిఖిల్, శ్రీకాంత్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న నాయకులు

హోరాహోరీగా బ్యాడ్మింటన్ పోటీలు

మంచిర్యాలటౌన్, జూన్ 29: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంచిర్యాలలోని మాస్టర్స్ అకాడమీలో జరుగుతున్న యూనిక్స్ సన్‌రైజ్ సీనియర్స్ 10వ రాష్ట్ర స్థాయి మెన్ అండ్ ఉమెన్ బ్యాడ్మింటన్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. శనివారం మెన్స్ విభాగంలో సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్, ఉమెన్స్ విభాగంలో సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ పోటీలు, ప్రీక్వార్టర్స్, క్వార్టర్స్, సెమీ ఫైనల్ మ్యాచ్‌లు ఉదయం నుంచి సాయంత్రం వరకూ సాగాయి. ఈ నెల 30న ఆదివారం ఉదయం 10 గంటలకు మెన్ అండ్ ఉమెన్ సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్ పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పుల్లూరు సుధాకర్ తెలిపారు. ఈ పోటీలకు కన్వీనర్‌గా గాజుల ముఖేశ్‌గౌడ్, టోర్నమెంట్ అబ్జర్వర్‌గా యువీఎన్ బాబు, రిఫరీగా మల్లికార్జున్, మ్యాచ్ కంట్రోలర్‌గా పీవీఎల్ కుమార్ వ్యవహరించారు. అసోసియేషన్ ట్రెజరర్ సత్యపాల్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్లు భాస్కర్ల వాసు, మీనారెడ్డి, జాయింట్ సెక్రటరీ రమేశ్‌రెడ్డి, మధు, కార్యవర్గసభ్యులు కృష్ణ, రాజలింగు, లక్ష్మీనారాయణ, హర్ష, పీడీలు, అంపైర్లు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

మిక్స్‌డ్ డబుల్స్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

ఫైనల్స్‌కు చేరిన క్రీడాకారులు వీరే

మెన్ సింగిల్స్‌లో లోకేశ్‌రెడ్డి (హైదరాబాద్), అజయ్ కార్తీక్ (జనగాం), ఉమెన్స్ సింగిల్స్‌లో రక్షితశ్రీ (రంగారెడ్డి), అభిలాష (రంగారెడ్డి), మెన్ డబుల్స్‌లో సుధీశ్ వెంకట్, ఏపీ శశాంక్, విఘ్నేశ్, వర్షిత్‌రెడ్డి, మిక్స్‌డ్ డబుల్స్‌లో సాత్విక్‌రెడ్డి, వైష్ణవి, విఘ్నేశ్, ఎల్ శ్రావ్య ఫైనల్స్‌కు చేరుకున్నారు. కాగా, సెమీఫైనల్ మ్యాచ్‌లకు చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్ హాజరై క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు.

విలేకరుల ముసుగులో అరాచకాలకు పాల్పడితే శిక్ష తప్పదు

మావోయిస్టు కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్

మంచిర్యాల, జూన్ 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : విలేకరుల ముసుగులో అరాచకాలకు పాల్పడితే ప్రజాక్షేత్రంలో శిక్ష తప్పదని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ ఓ ప్రకటనలో హెచ్చరించారు. బెల్లంపల్లి పట్టణానికి చెందిన ఇద్దరు విలేకరులు పోలీసులతో మైత్రి సంబంధాలను కొనసాగిస్తూ గూండాయిజం చేస్తున్నారని, మహిళలను బెదిరిస్తూ భయానక వాతావరణం కల్పిస్తున్నారని తెలిపారు. ఇకనైనా పద్ధతులు మార్చుకొని ప్రజలకు క్షమాపణ చెప్పాలని, లేని పక్షంలో శిక్ష తప్పదని హెచ్చరించారు. కోల్‌బెల్ట్ ప్రాంతంలో కొంతమంది విలేకరుల ముసుగులో నైతిక విలువలకు తిలోదాకాలిచ్చి అక్రమ వసూళ్లు, ఆర్థిక లావాదేవీలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. జర్నలిజం పేరుతో, పోలీసుల అండదండలతో అధికారులను గుప్పెట్లో పెట్టుకొని ప్రజలను వేధింపులకు గురిచేస్తున్నారని తెలిపారు. జర్నలిస్టు సంఘాలు తక్షణం కలుగజేసుకుని నకిలీ, దొంగ విలేకరుల అసాంఘిక చర్యలను అడ్డుకొని చర్య లు తీసుకోవాలని కోరారు. అక్రమాలు, రౌడీయిజం, దౌర్జన్యాలను ఎండగడుతూ ప్రజలను చైతన్యవంతులను చేయడంలో జర్నలిస్టు సంఘాలు ప్రధాన భూమిక పోషించాలని కోరారు.

నిరసన ర్యాలీ తీస్తున్న సీపీఎం శ్రేణులు

మోదీ దిష్టిబొమ్మ దహనం

బెల్లంపల్లి, జూన్ 29 : కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల వేలం, ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు.ఈ మేరకు మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిణంలోని కాంటా చౌరస్తాలో ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అంతకు ముందు ప్రధాన వీధులగుండా కాంటా చౌరస్తా వరకు నిరసన ర్యాలీ తీశారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, ఆశయ్య మాట్లాడుతూ శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌లను సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం వెనక్కి తగ్గకుంటే పోరాటం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సంకె రవి, జిల్లా కార్యవర్గ సభ్యులు గుమాస ప్రకాశ్, అబ్బోజి రమణ, కనికర అశోక్, గుమాస అశోక్, దాగంఎకాంత్, దుంపల రంజిత్‌కుమార్, దూలం శ్రీనివాస్, తిరుపతి, సజీవన్, మనోహర్, సంకీర్తన్, నాయకులు రాజ్‌కుమార్, మహేశ్, అభినవ్ పాల్గొన్నారు.

ప్రగతిలో ప్రజాప్రతినిధుల సహకారం గొప్పది

● జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, ఎమ్మెల్యే కోవ లక్ష్మి
● ఆసిఫాబాద్ జడ్పీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం
● జడ్పీటీసీలు, ఎంపీపీలకు సన్మానం

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూన్ 29 : జిల్లాను ప్రగతి పథంలో నడిపించడంలో ప్రజాప్రతినిధులు అందించిన సహకారం గొప్పదని జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. పదవీ కాలం ముగియనున్న నేపథ్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని జడ్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ జడ్పీటీసీలు, ఎంపీపీలు అభివృద్ధికి సహకరించడమేగాక అనేక ప్రజా సమస్యలు పరిష్కరించారన్నారు. ఈ ఐదేళ్ల కాలంలో ఎలాంటి వివాదాలకు తావు లేకుండా జడ్పీ సర్వసభ్య సమావేశాలు సాఫీగా సాగాయన్నారు. ప్రజలకు సేవ చేయడానికి పదవే ముఖ్యం కాదన్నారు. అనంతరం ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ గడిచిన నాలుగున్నరేళ్లలో జడ్పీ చైర్‌పర్సన్‌గా పనిచేశానని, సభ్యులు, అధికారులు అందించిన సహకారం మరువలేనిదన్నారు. అనంతరం జడ్పీటీసీలు, ఎంపీపీలను జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, జడ్పీ అధికారులు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు అరిగెల నాగేశ్వరరావు, జడ్పీటీసీలు అజయ్ కుమార్, చంద్రశేఖర్, సంతోష్, రామారావు, దుర్పతబాయి, సరిత, ఎంపీపీలు, మల్లికార్జున్, విమలాబాయి, శ్రీదేవి, సౌందర్య, మోతీరాం, జిల్లా పరిషత్ ఉప కార్యనిర్వాహణాధికారి లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

జడ్పీటీసీలు, ఎంపీపీ లతో జడ్పీ చైర్మన్ కృష్ణారావు, ఎమ్మెల్యే కోవ లక్ష్మి

రమేశ్ రాథోడ్‌కు నివాళులర్పిస్తున్న దివాకర్‌రావు, కాంతయ్య

రాథోడ్ రమేశ్ హఠాన్మరణం

● ఆదిలాబాద్ జిల్లా రాజకీయాల్లో చెరగని ముద్ర ● జడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే, ఎంపీగా సేవలు

ఆదిలాబాద్, జూన్ 29(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లా రాజకీయాల్లో చెరగని ముద్ర వేసిన మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్(57) శనివారం గుండెపోటుతో మృతిచెందారు. ఆయన ఉట్నూర్‌లో ఉదయం ఒక్కసారిగా అనారోగ్యానికి గురయ్యారు. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స కోసం ఆదిలాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. కోమాలోకి వెళ్లిన ఆయనను హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో ఇచ్చోడ వద్ద గుండెపోటుతో మరణించారు. తెలుగుదేశం పార్టీ నుంచి రాజకీయ జీవితం ప్రారంభించారు. 1989లో నార్నూర్ జడ్పీటీసీగా విజయం సాధించిన ఆయన రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదిగారు. 1999లో ఖానాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. 2006లో ఆసిఫాబాద్ నుంచి జడ్పీటీసీగా గెలిచి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. 2009లో జరిగిన సాధారణ ఎన్నికల్లో తెలుగుదేశం నుంచి ఆదిలాబాద్ ఎంపీగా పోటీ చేసి విజయం సాధించారు. 2021లో బీజేపీలో చేరిన రాథోడ్ రమేశ్ గతేడాది నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఖానాపూర్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. టీడీపీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సన్నిహితంగా ఉంటూ పార్టీలో కీలక పదవులు నిర్వహించారు.

నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే

మంచిర్యాలటౌన్, జూన్ 29 : ఆదిలాబాద్ మాజీ ఎంపీ రమేశ్ రాథోడ్ పార్థివదేహానికి మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, లక్షెట్టిపేట మున్సిపల్ చైర్మన్ నలుమాసు కాంతయ్య నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

చేపల పెంపకం లాభదాయకం

● ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ● ఆసిఫాబాద్‌లో మత్స్యకారులకు అవగాహన

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జూన్ 29 : చేప ల పెంపకంతో మంచి లాభాలు పొందవచ్చునని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శనివా రం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన మత్స్యకారుల అవగాహన కార్యక్రమానికి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేంద ర్, అడిషనల్ డీఆర్డీవో రామకృష్ణ, షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి సజీవన్, ఇన్‌చార్జి జిల్లా మత్స్యశాఖ అధికారి సాంబశివరావు, జి ల్లా సమాఖ్య అధ్యక్షురాలు త్రివేణి, కన్సల్టెంట్ ఉదయ్ కిషోర్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ రాయితీలు ఉపయోగించుకొని చేపల పెంపకం చేపట్టి ఆర్థికాభివృద్ధి వైపు సాగాలన్నారు. చేపల సాగుకు 2 ఎకరాల స్థలం, బోర్ సదుపాయం ఉండాలని తెలిపారు. నూతన టెక్నాలజీ ద్వారా ఇం టి మిద్దెలపై, వ్యవసాయ క్షేత్రాల్లోనూ ప్రత్యేకంగా ట్యాంకులు ఏర్పాటు చేసి కూడా సాగుచేయవచ్చునని చెప్పారు. చేపల పెంపకానికి 5 లక్షల పెట్టుబడి అవుతుందని, 4 గుంటల స్థలముండాలని, యేటా 3 పంటలు తీయొచ్చని, రూ. 2లక్షల దాకా ఆదాయం పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని రైతులు, స్వయం సహాయక సంఘాల మహిళాలు వినియోగించుకోవాలని తెలిపారు. అలాగే చేపల పెంపకానికి ఉపయోగించిన నీరు మొక్కలకు సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుందని, యూ రియా తక్కువ మోతాదులోఅందిస్తే సరిపోతుందన్నారు. మత్స్యకార్మికులు, స్వయం సహాయక సంఘాలు, రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

• జన్మదిన శుభాకాంక్షలు
• పొలిటికల్
• స్వదేశాగమనం
• లీగల్ ప్రకటనలు
• క్లాసిఫైడ్స్
• పదవీ విరమణ
• ప్రారంభోత్సవం
• శ్రద్ధాంజలి
• సినిమా
• వివాహ మహోత్సవం
• షష్టిపూర్తి మహోత్సవం
మరియు
• అన్ని శుభకార్యాలు
నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679